క్లుప్తంగా

నేడు అయ్యవారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్

చాపాడు : మండలంలోని నక్కలదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అయ్యవారి పల్లె గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9:30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తామన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

హెచ్‌ఆర్‌ఏ పెంపుపై హర్షం

రాజుపాళెం : కొత్త జిల్లా కేంద్రాలలో ఇంటి అద్దె, అలవెన్సు 16 శాతానికి పెంచడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీపీ ప్రసాద్, అలీఖాన్, చంగలరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ సౌకర్యాన్ని 2024 మార్చి వరకు పొడిగించినట్లు ఉత్తర్వులు వెలువడడంతో ప్రభుత్వానికి అభినందనలు చెప్పారు. జిల్లాలో మిగిలిన మున్సిపాలిటీలకు ఇంటి అద్దె, అలవెన్సును 12 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు.

ఫలితాలపై ఎమ్మెల్యే ఆగ్రహం

బ్రహ్మంగారిమఠం : మల్లేపల్లె జెడ్పీ హైస్కూల్ పదో తరగతి పరీక్ష ఫలితాలపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల నుంచి 85 మంది పరీక్షలు రాయగా ఒక్క సైన్స్‌లోనే 31 మంది విద్యార్థులు ఫెయిల్‌కావడంతో గురువారం ఆయన ఎంఈఓను వివరణ అడిగారు. సైన్స్ ఉపాధ్యాయుడు బ్రహ్మానందరెడ్డి వృత్తిని పట్టించుకోకుండా, రాజకీయాలకు ప్రాధాన్యతను ఇస్తున్నారని, బోధన కూడా చేయడం లేదని ఎమ్మెల్యేకు ఎంఈఓ సమాధానం ఇచ్చారు. ఉపాధ్యాయుడి వ్యవహార శైలిపై నివేదికను విద్యాశాఖకు పంపాలని సూచించారు. ఫెయిల్ విద్యార్థులకు ఆయన స్థానంలో వేరే ఉపాధ్యాయుడిని ఏర్పాటు చేసి విద్యార్థులు పాస్ అయ్యేలా చూడాలని ఎమ్మెల్యే ఎంఈఓను ఆదేశించారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేట అయోధ్య నగర్‌లో శ్రీకోదండరామస్వామి ఆలయంలో నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను శుక్ర, శని, ఆదివారాల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు సీతారామలక్ష్మణ ఆంజనేయ, ధ్వజశిఖర, శివపార్వతులు, నందీశ్వర, నాగదేవత, వినాయక, నవగ్రహ విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహించనున్నారు. శుక్రవారం విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఈనెల 15న ఉదయం 8.30 గంటలకు రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి బలప్రదర్శన పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

ఎల్ఐసీకి ప్రజల ఆదరణ


జంపాల కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఆల్ ఇండియా లియాఫీ నాయకులు

ప్రొద్దుటూరు : నాటి నుంచి నేటి వరకు ప్రజల ఆశీస్సులు, ఆదరణతోనే ఎల్ఐసీ ఈ స్థాయికి ఎదిగిందని లియాఫి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలు, కర్నాటక జోనల్ అధ్యక్షుడు జంపాల కృష్ణారెడ్డి తెలిపారు. జోనల్ అధ్యక్షుడిగా ఎన్నికైన నేపథ్యంలో గురువారం ఎల్ఐసీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఆల్ ఇండియా లియాఫి సీనియర్‌నాయకులు నారాయణరెడ్డి, కడప డివిజన్ లియాఫి అధ్యక్షులు జయభరత్‌రెడ్డి, కార్యదర్శి కదిరప్ప, ట్రెజరర్ కృష్ణ నగేష్, రికార్డ్ క్లర్క్ సరళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాపు మార్పుపై మహిళల హర్షం

కలసపాడు : మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ అధికారులు గురువారం గిద్దలూరు రోడ్డులోని సగిలేరు బ్రిడ్జి సమీపంలో ఏర్పాటు చేశారు. గతంలో స్టేట్‌బ్యాంకుకు ఎదురుగా మద్యం షాపు ఉండటంతో మహిళలు ఇబ్బందులు పడుతుండేవారు. గతంలో పలుమార్లు ప్రజా సంఘాలు వైన్‌షాపును మార్పు చేయాలని ఆందోళనలు చేపట్టారు. స్థానిక ఎస్‌ఐ నాగమురళి చొరవతో స్టేట్‌బ్యాంకు ఎదురుగా ఉన్న మద్యం దుకాణాన్ని సగిలేరు బ్రిడ్జి వద్దకు మార్పు చేయడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు.

50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు

అట్లూరు : భూములను సారవంతం చేసుకునేందుకు రైతులకు 50 శాతం సబ్సిడీతో జీలగలు, జనుముల విత్తనాలు మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారి రామకృష్ణయ్య పేర్కొన్నారు. మండలానికి సంబంధించి 119 క్వింటాళ్ల జీలగలు, 31 క్వింటాళ్లు జనుములు మంజూరయ్యాయన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాలకు వాటిని అందజేశామన్నారు.

రైతులకు అధిక ప్రాధాన్యత

మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి


లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బ్రహ్మంగారిమఠం : ముఖ్య మంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతులకు అధిక ప్రాధాన్యత ఇస్తుండటంతో రైతులు అన్ని విధాలుగా సంతృప్తిగా ఉన్నారని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం బి.మఠం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వాలు రైతులను విస్మరించడంతో రైతులు నష్టపోయారన్నారు. రైతుల బాధలు కళ్లారా చూసిన జగన్ అధికారంలోకి వచ్చాక రైతులకు అండగా నిలుస్తున్నారన్నారు. మండలంలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చొరవ చూపాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో తిరుగుతూ నిరుపేదలకు వైద్యసేవలందించాలన్నారు. తహసీల్దార్ ఈశ్వరయ్య మాట్లాడుతూ మండలంలో అధికంగా భూ సమస్యలు ఉన్నాయని వాటిని పూర్తిగా పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఉపాధి ఏపీఓ వసంతకుమార్ మాట్లాడుతూ మండలంలో ప్రస్తుతం 5వేల మంది కూలీలకు ఉపాధి పనులు కల్పిస్తున్నామన్నారు. గతం రైతులు ఏర్పాటు చేసుకున్న గోశాలల నిర్మాణానికి నిధులు నిలిచిపోవడంతో ప్రభుత్వం తక్షణం నిధులు విడుదల చేసిందన్నారు. పశువైద్య అధికారుల సమాచారం ప్రకారం మండలంలో 65 గోశాలలకు బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగదీష్ మాట్లాడుతూ మండలంలో తాగునీటి కోసం సీఎండీఎఫ్ నిధులతో 6 పనులు మంజూరయ్యాయన్నారు. ఎద్దులాయపల్లెలో తాగు నీటి బోరింగ్ రిపేరునకు పరికరాలు లేవని అధికారులు చెపుతున్నారని గ్రామ సర్పంచ్ భర్త నారాయణయాదవ్ తెలిపారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ బ్రహ్మంగారిమఠాన్ని దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి ఇక్కడే ఆర్టీసీ బస్ డిపో ఉండేలా ఉత్తర్వులు తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా మార్క్ ఫెడ్ మేనేజర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి సంక్షేమం

ప్రతి ఇంటికి సంక్షేమ పథకం ద్వారా లక్షలలో లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని సోమిరెడ్డిపల్లె పంచాయతీ వీరభద్రాపురం, కొత్తూరు, కాలనీలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉండాలని మా ఓట్లు ఆయనకే వేస్తామంటూ లబ్ధిదారులు అభిప్రాయం వెల్లడించారు. కొత్తూరులో డ్రైనేజీలు, వ్యవసాయ భూములు ఇవ్వాలని, జగనన్న కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలని ప్రజలు ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య, ఎంపీటీసీ మనోహరాచారి, తిప్పన నాగార్జుననాయుడు, జోగయ్య, స్థానిక నాయకులు పాల రామిరెడ్డి, రామగురివిరెడ్డి, సోమయ్య, ఉమాపతి, భాస్కర్‌రెడ్డి, సురేష్, మాజీ సర్పంచ్ భూమిరెడ్డి కృష్ణారెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత భోజనం స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే


స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : త్వరలో ఏర్పాటు చేయనున్న రాచమల్లు రాజన్న ఉచిత భోజనం కోసం గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కొర్రపాడు రోడ్డులోని మున్సిపల్ పెట్రోలు బంకు పక్కనున్న స్థలాన్ని పరిశీలించారు. వంటశాల ఏర్పాటుపై, రాచమల్లు రాజన్న ఉచిత భోజన కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ కార్యక్రమంలో రాజుపాళెం మండల వైస్ ఎంపీపీ ఎస్‌ఏ నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం 'వరద'కు తగదు


మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరులో జరుగుతున్న అభివృద్ధిని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అడ్డుకోవడం తగదని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అధ్యక్షతన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్లు, పాలకమండలి సభ్యులందరి సహకారంతో ప్రొద్దుటూరులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. వరదరాజులరెడ్డి 25 ఏళ్లపాటు సాగించిన పాలనలో జరగని అభివృద్ధి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నేతృత్వంలో జరుగుతోందని, దీనిని చూసి ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్పత్రి దగ్గర రోడ్ల విస్తరణ, పోల్స్, లైటింగ్‌పై వరద చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. మైదుకూరు రోడ్డులో ఏర్పాటు చేసిన బటర్ ఫ్లై లైటింగ్ ధర రూ.90వేలు కాగా ప్రభుత్వాస్పత్రి దగ్గర పోల్ లైట్ ధర రూ.65వేలకే ఏర్పాటు చేసి అత్యంత సుందరంగా తీర్చిదిద్దామన్నారు. దీని వల్ల మున్సిపాలిటీకి మేలు జరిగిందా లేదా అని ప్రశ్నించారు. శివాలయం కూడలిలో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ నిర్మాణంపై వరద చేసిన ఆరోపణలు ఆయన చాదస్తానికి నిదర్శనం అని అన్నారు. నిర్మించే మార్కెట్ స్థలంలో గతంలో కోనేరు ఉండేదని, అందుకే అక్కడ లూజ్ సాయిల్ ఉండటంతో మూడు అడుగుల కాంక్రీట్ పుటింగ్ తప్పనిసరి అని తెలుసుకోవాలన్నారు. కూరగాయల మార్కెట్‌లో తవ్విన మట్టిలో అవినీతి జరిగిందని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. కుందు –పెన్నా వరద కాలువకై తవ్విన మట్టిని ఎక్కడ డంప్ చేశారో స్పష్టం చేయాలని వరదను ప్రశ్నించారు. నిజంగా మీకు చిత్తశుద్ధి ఉంటే నిర్మాణ పనులను చేపట్టాల్సిందిగా వరదకు సవాల్ విసిరారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో మున్సిపల్ అభివృద్ధికి రూ.350 కోట్లు కేటాయిస్తే చేతకాక వెనక్కు పంపిన ఘనత వరదకే దక్కుతుందన్నారు. కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్ విధానం


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ జె.వినయ్‌కుమార్

బద్వేలు అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానం పేదలకు వరంలాంటిదని తొట్టిగారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అనంతరాజుపురం పంచాయతీ సి.బోయినపల్లె గ్రామంలో గురువారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా రోగి ఇంటి వద్దకే డాక్టర్, సిబ్బంది వచ్చి వైద్యసేవలు అందిస్తారని తెలిపారు. అంతేకాకుండా ఆయా గ్రామాల్లోని గర్భిణులకు, బాలింతలకు, చిన్న పిల్లలకు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి 14 రకాల రక్తపరీక్షల ద్వారా వ్యాధులను గుర్తించి 105 రకాల మందులతో వ్యాధుల నివారణకు చర్యలు తీసుకుంటారని తెలిపారు. అనంతరం వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న వారికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే సంక్రమణ, అసంక్రమణ వ్యాధులపై, గర్భిణులకు, బాలింతలకు పోషకాహార ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, వైద్య సిబ్బంది వాణిశ్రీ, స్వాతి పాల్గొన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

బద్వేలు : సమస్యల పరిష్కారానికి గ్రామ సచివాలయాలకు వచ్చే పేదలకు సిబ్బంది జవాబుదారీగా ఉండాలని బద్వేలు డివిజనల్ పంచాయతీ అధికారి రమణారెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం పోరుమామిళ్ల పట్టణంలోని సచివాలయం–1ని పరిశీలించారు. రికార్డుల నిర్వహణను తనిఖీ చేసి అనంతరం సిబ్బందితో మాట్లాడారు. సచివాలయ సిబ్బంది చిత్తశుద్ధితో విధుల నిర్వహించి పేదల సమస్యలను పరిష్కరించాలి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా సచివాలయాలతో స్థానికంగానే పాలనను తీసుకువచ్చారని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించాలని సూచించారు. సమయపాలన పాటిస్తూ బయోమెట్రిక్ అటెండెన్స్ తప్పనిసరిగా వేయాలన్నారు.యూనిఫాంతో పాటు రికార్డులు నిర్వహించాలని సూచించారు.విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓ సుబ్బారెడ్డి, సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొన్న అడా చైర్మన్ గురుమోహన్

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన గురప్ప స్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు, హోమాలతో పాటు కుంభాభిషేకం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ సింగసానిగురుమోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు గురుమోహన్‌కు ఘనస్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో పాటు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపునకు విశేష స్పందన

రాజుపాళెం : రాజుపాళెంలోని గ్రంథాలయంలో నిర్వహించే వేసవి శిక్షణ తరగతులకు విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోందని గ్రంథాలయ అధికారి ప్రతాపుడు తెలిపారు. అందులో భాగంగా గురువారం కథలలోని నీతి గురించి ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, పురుషోత్తం విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ గ్రంధాలయంకు రావడం వల్ల భవిష్యత్తులో ఎవరితో ఎలా మెలగాలి, ఏవిధంగా మాట్లాడాలో తెలుస్తుందన్నారు. ఏఎల్ఐ నారాయణరెడ్డి పిల్లలకు కథలు చెప్పారు.

చాపాడు : వేసవి విజ్ఞాన శిబిరం నాలుగో రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని గ్రంథాలయం వద్ద గురువారం తెలుగు పాఠ్యాంశాలలోని సంధులు, సమాసాలపై విద్యార్థులకు వివరించినట్లు గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి తెలిపారు. వేసవి సెలవుల్లో చదువు మీద పట్టుకోల్పోకుండా వారు చదువుకుని తరగతుల పాఠ్యాంశాలపై చదువు చెప్పటంతో పాటు వివిధ రకాలైన వాటిపై చర్చించటం జరుగుతుందన్నారు.

మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని విశ్రాంత తెలుగు పండితుడు వీఎం భాస్కర్ రాజు విద్యార్థులకు సూచించారు. స్థానిక వసంతపేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని క్రమశిక్షణ, పట్టుదలతో సాధించాలని చెప్పారు. జిరాఫీ చెస్ కోచ్ అరవింద్, తేజస్ విద్యార్థులకు జిరాఫీ చెస్ ఎలా ఆడాలో నేర్పించారు. యోగా టీచర్లు శ్రావణి, వెంకటసుబ్బమ్మ యోగాసనాలు నేర్పించారు. గ్రంథాయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాం సాహెబ్, రచయిత డీకే చదువుల బాబు, రెహ్మాన్ ఖాన్, శారద పాల్గొన్నారు.

14న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో శ్రీఅభయాంజనేయ స్వామి తిరునాల సందర్భంగా 14వ తేదీన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ సేవకుడు, ఆర్ట్‌ఆఫ్‌లివింగ్ యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.70 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలు అందజేస్తారన్నారు. పూర్తి వివరాలకు 9490792999 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఎస్టీయూఫ్ మండల కార్యవర్గం ఎన్నిక


కె.శ్రీనివాసులు

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలో గురువారం ఎస్టీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్టీఎఫ్ మండల అధ్యక్షుడిగా కె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా నాగాంజనేయులు, మండల మహిళా విభాగం అధ్యక్షురాలిగా యు.సుజాతలను ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా మదన్ మోహన్‌రెడ్డి వ్యవహరించారు. ఈ సందర్భంగా ఎస్టీఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు సి.శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులను పాఠశాలలకు వెళ్లాలని, నాడు – నేడు పనులను పర్యవేక్షించాలని ఆదేశాలివ్వడం దారుణమన్నారు. వేసవి కాలంలో పనిచేసిన దానికి ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. ప్లస్ – 2 పాఠశాలలకు అర్హత ఉన్న ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు.

బాలభవితలో చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ఫరూక్ అహ్మద్

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక జిల్లా ఆస్పత్రిలోని జిల్లా బాల భవిత కేంద్రంలో ఉదయానంద హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరుగురు చిన్నారులకు గుండె సంబంధిత సమస్యలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వీరిని మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని పద్మావతి కార్డోకేర్ ఆస్పత్రికి రెఫర్ చేసినట్లు చిన్నపిల్లల గుండె వైద్య నిపుణుడు డాక్టర్ ఫరూక్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ ఆనంద్‌బాబు, మెడికల్ ఆఫీసర్ వాసంతి, మెడికో కౌన్సిలర్ రామ్మూర్తి నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ బలపనూరు గ్రామానికి చెందిన బీటెక్ తృతీయ సంవత్సరం విద్యార్థిని గంగాసాయికి ల్యాప్‌టాప్‌ను అందించారు. బాగా చదువుకుని ఉన్నత స్థానంలో నిలవాలని ఎమ్మెల్సీ ఆకాంక్షించారు. వలసాని స్వచ్ఛంద సేవా సంస్థ, తెలుగు తల్లి సేవా సమితి వారి సహకారంతో గుండుబోయిన విజయకుమార్, రమేష్ యాదవ్, రమణయ్య, శంకరయ్య కువైట్ నుంచి విద్యార్థినికి ల్యాప్‌టాప్ పంపించారు. వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, శూలం ప్రసాద్, ఎమ్మెల్సీ సోదరుడు ఆర్.ప్రసాద్, కల్లూరు ప్రసాద్‌రెడ్డి, రాముడు, శ్రీధర్, చిలకల కృష్ణారెడ్డి, వాసు తదితరులు పాల్గొన్నారు.

• కల్యాణం కమనీయం


భీమలింగేశ్వరస్వామి, సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాజుపాళెం : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాల గ్రామంలోని సంజీవరాయ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం వైభవంగా గంగాగౌరి సమేత భీమలింగేశ్వరస్వామి, సీతారాముల కల్యాణోత్సవాన్ని వేదపండితులు ఏకకాలంలో కన్నుల పండువగా నిర్వహించారు. నూతనంగా చేయించిన ఈ ఉత్సవ విగ్రహాలను ప్రత్యేంగా అలంకరించి కల్యాణ మండపంలో ఆశీనులను చేశారు. వేదపండితులు శాస్త్రోక్తంగా వేదమంత్రోచ్చారణలో మంగళవాయిద్యాలతో వైభవంగా కల్యాణాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, సర్పంచ కానాల రాధా, వైఎస్సార్‌సీపీ నాయకుడు బలరామిరెడ్డి, ఈఓ నరసయ్య ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైభవంగా శ్రీచక్రం ప్రతిష్ట

భీమలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీచక్రం ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయంలో మూడు రోజులుగా వేద పండితులు పూజలు నిర్వహిస్తున్నారు. దాతలు సర్పంచ్ రాధా, ఆమె భర్త దామోదర్‌రెడ్డి శ్రీచక్రం ఆలయానికి సమర్పించారు.

జగన్ పాలన దేశానికే ఆదర్శం


చిన్నాయపల్లెలో లబ్ధిదారురాలికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

కాశినాయన : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. గురువారం మండలంలోని చిన్నాయపల్లె, సిద్దాయపల్లె గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇప్పటి వరకు చేకూరిన పథకాలను బుక్‌లెట్ అందజేసి వివరించారు. సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతిఒక్కరికి పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. సచివాలయ, వాలంటరీ వ్యవస్థను ఏర్పాటు చేసి గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారని అన్నారు. అర్హులైన లబ్ధిదారులు ఎవరైనా ఉంటే జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ద్వారా తెలియజేయాలని సూచించారు. కొంత మంది సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అధికారులు వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అర్హత ఉండి పింఛన్లు ఇతర సంక్షేమ పథకాలు రాని వారు ఎవరైనా ఉన్నారా అని ఎమ్మెల్యే ఆరా తీశారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముజఫర్‌రహీమ్, పీఆర్ ఏఈ పుల్లయ్య, ఏపీఎం వీరాంజనేయులు, స్థానిక నాయకులు రమణారెడ్డి, గురివిరెడ్డి, గురయ్య, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నవరత్నాలను ప్రజలకు అందించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలను ప్రజలకు అందించాలని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం సభాభవనంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో వ్యవహరించి సంక్షేమ పథకాలను ప్రజలకు క్రమం తప్పకుండా అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఇది ఎన్నికల ఏడాది అని .. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రధాన సమస్యలు ఏమైనా ఉంటే ప్రజా ప్రతినిధులు, అధికారులు నేరుగా తనకు తెలపవచ్చునని చెప్పారు. వీటిని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కేసీ కెనాల్, మైలవరం ఉత్తర కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఉపాధి హామీ పథకం ఏపీపీ జగదీశ్వరరెడ్డిని కోరారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగభరత్ రెడ్డిని ఎంపీపీ ఆదేశించారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ శారద, ఎంపీడీఓ ఉపేంద్రారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.